

నష్టం లెక్కింపు

మొంథా తుఫాన్‌తో జిల్లాలో తీవ్ర నష్టం కలిగింది. భారీ ఎత్తున పంటలు నీట మునిగాయి. 48 గంటల పాటు కురిసిన వర్షాలకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చెరువులు, వంకలు, వాగులు సైతం పొంగి పొర్లాయి. జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలోని పలు కాలనీలు నీట మునిగాయి. ఆయా ప్రాంతాల్లో రాకపోకలు స్తంభించాయి. ఎక్కడికక్కడ పొలాల్లో నీరు చేరి రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. రహదారులు, బ్రిడ్జిలు, విద్యుత్ స్తంభాలు, పంటలు తదితర రూపాల్లో రూ. కోట్లలో జిల్లాలో నష్టం కలిగినట్లు అధికార యంత్రాంగం నిర్ధారిస్తోంది. ఏది ఏమైనా మొంథా తుఫాన్ జిల్లా ప్రజానీకంతో పాటు రైతులను ఉక్కిరిబిక్కిరి చేసినట్లైంది.

– నంద్యాల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి)



ఆర్అండ్‌బీ రోడ్డుపై నీరు ఇలా

- తుఫాన్‌తో తీవ్ర నష్టం
- 120 కి.మీ దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రోడ్లు
- 464 హెక్టార్ల పంటల పరిశీలన
- తేలుతున్న లెక్కలు..
- సిద్ధమవుతున్న ప్రతిపాదనలు

జిల్లాలో పరిస్థితి ఇలా...

- వ్యవసాయ పంటలు : 36,948.21 హెక్టార్లు
- ఉద్యాన పంటలు : 744 హెక్టార్లు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన పంటలు : 464 హెక్టార్లు
- దెబ్బతిన్న పంచాయతీ రోడ్లు : 32.85 కి.మీ
- దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రోడ్లు : 120 కి.మీ
- విద్యుత్‌శాఖ పరంగా : రూ. 4లక్షలు
- పశుసంవర్ధకశాఖ పరంగా :రూ. 10లక్షలు
- ఇరిగేషన్ శాఖపరంగా దెబ్బతిన్న కాలువలు : 140

విద్యుత్‌శాఖ పరంగా..

జిల్లాలో సుమారు 60 విద్యుత్ స్తంభాలు విరిగి పడగా.. 20 విద్యుత్ స్తంభాలకు పైగా ఒరిగిపడ్డాయి. తద్వారా విద్యుత్ తీగలు సైతం అక్కడక్కడ తెగిపడ్డాయి. ఈ నేపథ్యంలో ఎక్కడిక్కడ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

పశుసంవర్ధకశాఖ పరంగా..

జిల్లాలో పశుసంవర్ధకశాఖ పరంగా.. పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల రూపంలో సుమారు రూ. 10 లక్షలు నష్టం ఉండొచ్చని అధికారుల అంచనా. ఉద్యానశాఖ పరంగా... జిల్లాలో 744 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

తేలుతున్న లెక్కలు..

మొంథా తుఫాన్ జిల్లాలో మూడు రోజులుగా అన్ని వర్గాల ప్రజలను కుదిపేస్తోంది. ఇదే క్రమంలో మూడు రోజులుగా జరిగిన నష్టాన్ని సైతం అధికార యంత్రాంగం సైతం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ సైతం అదే పనుల్లో నిమగ్నమయ్యారు. తద్వారా జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల వారీగా అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా కలిసి జరిగిన నష్టాలను అంచనా వేసి సమగ్ర నివేదిక తయారు చేసే పన్నుల్లో నిమగ్నమయ్యారు.

464 హెక్టార్ల పంటల పరిశీలన..

జిల్లా వ్యాప్తంగా గురువారం కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తిక్ సైతం వివిధ శాఖలకు చెందిన అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న తీవ్రతను గుర్తించి నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ పరంగా జిల్లాలో మొంథా తుఫాన్ నేపథ్యంలో దెబ్బతిన్న 36,948. 21 హెక్టార్లలో మొదటి రోజైన గురువారం 464 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



చాగలమర్రిలో పీఆర్ రోడ్డును పరిశీలిస్తున్న ఈఈ నాగరాజు

● ఆర్అండ్‌బీ పరంగా..120 కిలో మీటర్లు..

జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో 120 కి.మీ మేర రోడ్లు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. వీటికి తాత్కాలిక మరమ్మతులకు రూ. 10 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ. 50 కోట్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిలో ఎక్కువగా బనగానపల్లె, ఆళ్లగడ్డ, నంద్యాల నియోజకవర్గాల పరిధిలో ఎక్కువగా రోడ్లు దెబ్బతిన్నట్లు తెలిసింది. కొలిమిగుండ్ల సమీపంలోని అంకిరెడ్డిపల్లి సమీపంలో రెండు బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి.



భవనాశి ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్, సీఐలు

జిల్లాలో 40 లోలెవల్ బ్రిడ్జిలు దెబ్బతిన్నట్లు కూడా అధికారులు గుర్తించారు.

● 32.85 కి.మీ..పంచాయతీ రోడ్లు..: జిల్లా వ్యాప్తంగా పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో 32.85 కి.మీ మేర రోడ్డు, 12 బ్రిడ్జి, కల్వర్టులు దెబ్బతిన్నట్లు ఆ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా వేశారు. వీటికి తాత్కాలిక మరమ్మతుల కింద రూ. 26.91 లక్షలు.. శాశ్వత మరమ్మతులకు రూ. 21.05 కోట్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాలో చాగలమర్రి, ఆత్మకూరు, నందికొట్కూరు, బనగానపల్లె ప్రాంతాల్లో రోడ్లు ఎక్కువగా దెబ్బతిన్నట్లు తెలిసింది.

ఇరిగేషన్ శాఖ పరంగా...

జిల్లాలో 140 కాలువలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. వీటికి తాత్కాలిక మరమ్మతుల కింద రూ.2.05కోట్లు, శాశ్వత పనుల కింద రూ. 40.76 కోట్లు నిధులు వెచ్చించాలని నివేదిక సిద్ధం చేశారు.

భవనాశి పరిసర ప్రాంతాల్లోని ఇటుకల బట్టీల దుస్థితి ఇలా



464 హెక్టార్లలో గణన

- మొంథా ధాటికి నష్టపోయిన పంట అంచనాకు దిగిన సిబ్బంది
- ఏపీఐఎంఎస్ ద్వారా నమోదు

నంద్యాల ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వ్యాప్తంగా మొంథా తుఫాన్ ధాటికి నష్టపోయిన పంటల గణన గురువారం ప్రారంభమైంది.



వరద బాధితులకు ఆహార పొట్లాల అందజేత

పంట నష్టం అంచనాలను రైతుల వారీగా ఏపీఏఐఎంఎస్ (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం)అప్లికేషన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం ఏవోల పర్యవేక్షణలో ఆర్ఎస్‌కే సిబ్బంది 464 హెక్టార్‌లలో పంటనష్టాన్ని లెక్కించారు. 30శాతం పైగా నష్టపోయిన పంటలకు పరిహారం అందనుంది. దాన్ని కూడా మానవతా దృక్పథంతో రైతులందరినీ ఆదుకుంటామని కలెక్టర్ రాజకుమారి హామీనిచ్చారు.

నష్టపరిహారాన్ని పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

జిల్లాలో మొంథా తుఫాన్ ధాటికి నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో కంటే మిన్నంగా పరిహారాన్ని పెంచింది.

ఎందుకీ వివక్ష

- నంద్యాల జిల్లా ఉల్లి రైతులు పరిహారానికి అనర్హులా?
- జిల్లాలో 12,915.24 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు
- ప్రకృతి విపత్తులతో భారీగా నష్టపోయిన ఉల్లి రైతులు

నందికొట్కూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులతో ఉల్లి పంట నష్టపోయిన నంద్యాల జిల్లా రైతులకు పరిహారం ప్రకటించలేదు. పక్కనే ఉన్న కర్నూలు జిల్లాలో మాత్రం పరిహారం ఇచ్చారు. ఈ వివక్ష ఎందుకని నంద్యాల జిల్లా రైతులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం హెక్టారుకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చింది. అయితే ఈ ప్రకటన కేవలం కర్నూలు జిల్లాకే వర్తిస్తుందని, నంద్యాల జిల్లాకు వర్తించదని అధికారులు చెబుతున్నారు.

ఎకరా ఉల్లి సాగుకు రైతులు కనీసం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. అధిక వర్షాలతో కుళ్లు తెగుళ్ల సోకాయి. కలుపులు భారీగా రావడంతో పురుగుమందులు, కలుపుతీతకు భారీగా ఖర్చు చేశారు. పైగా ధర పతనం కావడంతో కోత కూలీలు కూడా గిట్టుబాటు కావని కొందరు రైతులు పంటను దున్నేస్తున్నారు. ఒక్క నందికొట్కూరు నియోజకవర్గంలోనే ఉల్లి దాదాపు 6 వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో పంటను కోసి మార్కెట్‌కు తరలిస్తే కర్నూలు రైతులకే పరిహారం వస్తుందని అధికారులు తేల్చేశారు.



బొల్లవరం గ్రామంలో ట్రాక్టర్‌తో ఉల్లిని దున్నేస్తున్న రైతు

జిల్లాలో 12,915.24 ఎకరాలు ఈ క్రాప్‌లో నమోదు

నంద్యాల జిల్లాలోని 23 మండలాల్లో ఈ ఏడాది ఉల్లి భారీగా సాగైంది. డోన్ మండలంలో అత్యధికంగా 3,688.12 ఎకరాల్లో ఉల్లి సాగు చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. 12,915.24 ఎకరాలను ఈనెల 28వ తేదీ వరకు ఈ క్రాప్ బుకింగ్‌లో హార్టికల్చర్ అధికారులు నమోదు చేశారు. కాని ఇంకా ఈ క్రాప్ బుకింగ్ చేయని ఉల్లి పంట ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని రైతులు అంటున్నారు. ఉల్లి పంట ఈక్రాప్ బుకింగ్ నమోదు చేయడంలో అర్టికల్చర్ అధికారులు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. అదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి పంటను కేవలం కర్నూలు రైతులే అధికంగా పండిస్తారని, వారిని మాత్రమే నష్టపరిహారానికి ఎంపిక చేసింది.

రెండు ఎకరాలకు రూ. లక్ష ఖర్చు చేశా



నేను రెండు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాను. రెండు ఎకరాలకు రూ.లక్షకు పైగా ఖర్చు వచ్చింది. ప్రస్తుతం ఉల్లికి గిట్టుబాటు ధర లేకపోవడంతో చేతికొచ్చిన పంటను కోత, మార్కెట్‌కు తరలించడం లాంటి పనులకు మరో రూ.50 వేలు ఖర్చు వస్తుంది. కర్నూలు జిల్లాలో పరిహారం ఇచ్చి మాకు ఇవ్వకపోవడం వివక్షే.

● మధు, ఉల్లి రైతు, బొల్లవరం గ్రామం, నందికొట్కూరు మండలం

నష్టపరిహారం చెల్లించాలి



నంద్యాల జిల్లా ఉల్లి రైతులకు ప్రభుత్వం పరిహారం ప్రకటించకుండా పక్షపాతం చూపడం తగదు. ఈ జిల్లాలోని ఉల్లి రైతులను ఎందుకు అర్హులుగా ఎంపిక చేయలేదో అర్థం కావడం లేదు. ప్రభుత్వం నంద్యాల జిల్లా ఉల్లి రైతులను కూడా ఆదుకోవాలి.

- పక్కీర్ సాహెబ్, సీపీఎం నాయకుడు. నందికొట్కూరు

రైతులను ఆదుకుంటాం : జేసీ

ఆళ్లగడ్డ/చాగలమర్రి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. గురువారం ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లె, చాగలమర్రి మండలం నేలంపాడు గ్రామంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. పంట నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టం అంచనాను వ్యవసాయ సిబ్బంది యాప్ ద్వారా నమోదు చేయాలని జేసీ సూచించారు. అన్ని గ్రామాల్లో పంట నష్టం అంచనా వేసి రెండు రోజుల్లో నివేదికలు పంపించాలని అన్నారు. పంట నష్టం అంచనాలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన అధికారులను హెచ్చరించారు. జేసీ వెంట తహసీల్దార్లు విజయ్ కుమార్, జ్యోతి రత్నకుమారి, చాగలమర్రి ఎంపీడీవో తాహిర్‌హుసేన్, ఏవో రంగనేతాజీ, ఆళ్లగడ్డ హెచ్‌వో దస్తగిరి తదితరులు ఉన్నారు.



మిట్టపల్లెలో పంటను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

నేటి నుంచి విశ్వశాంతి మహాయాగం

- కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

7

పచ్చి మిర్చి పతనం



రుద్రవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పచ్చిమిర్చి ధర ఒక్కసారిగా పతనమైంది. గత వారం రూ.2,400చొప్పున ధర పలికిన 50 కేజీల బస్తా రూ.400కు గురువారం పడిపోయిందని రైతులు వాపోయారు. 50 కేజీల బస్తాకు కూలి ఖర్చులే రూ.250 చెల్లిస్తున్నామని రైతులు తెలిపారు. దీంతో రైతుకు ఒక బస్తా మీద రైతుకు కూలి రేటు పోయి రూ.150 మాత్రమే దక్కుతోంది. దీంతో రైతులు మార్కెట్‌కు మిర్చిని తీసుకుపోలేని పరిస్థితి ఏర్పడుతోంది.

నేడు కృష్ణమ్మకు జలహారతి



శ్రీశైలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలోని పాతాళగంగకు శుక్రవారం సాయంత్రం జలహారతుల కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. పాతాళగంగ వద్ద కృష్ణవేణి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జలహారతి ఇవ్వనున్నట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో నది ఒడ్డున ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. నదులు ఉధృతంగా ప్రవహించినప్పుడు శాంతింపజేసేందుకు గంగమ్మకు జలహారతి ఇస్తారు. ఈ సందర్భంగా గంగమ్మకు సారెను సమర్పించి శాంతించమని వేడుకుంటారు. అందులో భాగంగానే శ్రీశైలంలో కృష్ణమ్మకు జలహారతి వేడుకను నిర్వహిస్తున్నారు.

పంట నష్టం సర్వే పూర్తి చేయండి : కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

బండిఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత గ్రామాల్లో త్వరితగతిన పంట నష్టం సర్వేను పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం బండిఆత్మకూరు మండలం సంతజూటూరు గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంటను కలెక్టర్ వ్యవసాయ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి ఎకరం జాబితాలో రాయాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని కలెక్టర్ రైతులకు భరోసా ఇచ్చారు. రైతులు మహేశ్వర రెడ్డి, శివ, పక్కీర్‌రెడ్డి, వీఏఏ ఆయేషా ఉన్నారు.

రైతులను ఆదుకుంటాం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

సంజామల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ధాటికి పంటలను నష్టపోయిన రైతులను ఆదుకుంటామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మంత్రి సంజామల, కోవెలకుంట్ల మండలాల్లో మంత్రి పర్యటించి నీట మునిగిన పంటలను పరిశీలించారు. సంజామలలోని పాలేరు వాగు ఉధృతి దెబ్బతిన్న పంటను పరిశీలించారు. ముదిగేడులోని ప్రాథమిక పాఠశాలలో ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండటాన్ని చూసి మంత్రి వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటిని తొలగించాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు తగిన స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్ అనిల్‌కుమార్‌ను ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తుఫాన్ ధాటికి పంటలు, రోడ్లు ధ్వంసమయ్యాయన్నారు. పంట నష్టపరిహారం గణన జరుగుతోందని, రైతులందరినీ ఆదుకుంటామని మంత్రి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి, హౌసింగ్ డీఈ కృష్ణా రెడ్డి, ఏడీ సుధాకర్, ఎంపీడీఓ సాల్మన్, ఏఓ జ్యోతి, హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, సంజామల సహకార సంఘం అధ్యక్షుడు పెండేకంటి కిరణ్ కుమార్, ఎస్సార్బీసీ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ మల్కి హుసేన్, టీడీపీ నాయకులు మోహన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



ముదిగేడులో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి



ఉయ్యాలవాడలో నీట మునిగిన మిరప పంట

పోటెత్తిన కుందూ

- స్తంభించిన రాకపోకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- వేలాది ఎకరాల్లో నీట మునిగిన పంటలు

ఉయ్యాలవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో కుందూ నది వరదలు బీభత్సాన్ని సృష్టించాయి. మండలంలో కుందూనదిపై ఉన్న వంతెనపై వరద ప్రవాహం పోటెత్తింది. దీంతో రూపన గుడి, ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు, పెద్దయమ్మనూరు, నర్సిపల్లె, సుద్దమల్ల, కాకరవాడ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నర్సిపల్లె, సుద్దమల్ల, రూపనగుడి, గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరి వారు నిరాశ్రయులుగా మిగిలారు. వేలాది ఎకరాల్లో వరి, మిరప, కంది, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు మునిగిపోయాయి. ఇవి దెబ్బతినే ప్రమాదం ఉంది. గురువారం సాయంత్రం వరద నీరు తగ్గుముఖం పట్టడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద బాధితులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

నర్సిపల్లెలో ఇళ్లలోకి చేరిన వరద





భవనాశి నదిపై కొనసాగుతున్న వరద

ఆత్మకూరులో తగ్గని వరద

- భవనాశి ఉప్పొంగడంతో నిలిచిన రాకపోకలు
- తగ్గని సిద్ధాపురం అలుగు ఉధృతి
- స్తంభించిన ఆత్మకూరు - దోర్నాల రహదారి

ఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో సంభవించిన మొంథా తుఫాన్ ధాటికి ఆత్మకూరు ప్రాంతంలో రెండు రోజుల పాటు కురిసిన వర్షాల ప్రభావం గురువారం కూడా తగ్గుముఖం పట్టలేదు. పట్టణ శివారులోని భవనాశి నదిపై వరద ప్రవాహం తగ్గుముఖం పట్టినప్పటికీ నీటి ఉధృతి ఉండటంతో ఆత్మకూరు నుంచి కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అయితే తహసీల్దార్ రత్నరాధిక, అర్బన్ సీఐ రాము, ఎస్ఐ నారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు ఎక్స్‌కవేటర్ ద్వారా వంతెన దాటి కురుకుంద, కొట్టాలచెరువు, వడ్లరామాపురం గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అలాగే ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులను చేయించి సచివాలయ సిబ్బందికి తగు సూచనలు చేశారు. వడ్లరామాపురం గ్రామంలోని మల్లెలమ్మ చెరువుకు ఏర్పడిన గండిని పరిశీలించి సహాయక చర్యల గురించి ఆరా తీశారు. భవనాశిపై నీటి ఉధృతి తగ్గే వరకు ఎవరూ వాగు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఆత్మకూరు నుంచి వడ్లరామాపురం వెళ్లే మార్గంలోని పీతురువాగు ఉప్పొంగడంతో కురుకుంద నుంచే వారు వడ్లరామాపురం గ్రామానికి చేరుకున్నారు. కాగా వరదరాజ స్వామి ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల నిలిపి వేయడంతో అక్కడి పరిస్థితిని కూడా అధికారులు పరిశీలించారు. వరదల వల్ల భవనాశి పరిసర ప్రాంతాల్లోని పంటపొలాలు, ఇటుకల బట్టీలు దెబ్బతిన్నాయి. ఆత్మకూరు పట్టణంలోని లోతట్టు కాలనీల్లో నిలిచిన వర్షపునీటిని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు యుద్ధప్రాతిపదికన దారిమళ్లించే పనులు చేపట్టారు.

కూలిన మట్టిమిద్దెలు

జూపాడుబంగ్లా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాను వల్ల ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాల్లో 30 మట్టిమిద్దెలు కూలిపోయాయి. కూలిన మట్టిమిద్దెలను గురువారం తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, ఆర్ఐ మౌలబాషా పరిశీలించారు. తాటిపాడు, 80బన్నూరు, తరిగోపుల, మండ్లెం, పారుమంచాల, తూడిచర్ల తదితర గ్రామాల్లో బాధితులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



తాటిపాడులో కూలిన మట్టిమిద్దెను పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, అధికారులు

తగ్గని సిద్ధాపురం అలుగు ఉధృతి

తుఫాన్ వల్ల సిద్ధాపురం చెరువులోకి గరిష్టస్థాయిలో నీటినిల్వలు అలుగుల ద్వారా నీరు బయటకు వెళ్లోంది. ఇందులో భాగంగానే చెరువు పక్కనే ఉన్న కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై అలుగు జలాలు గురువారం కూడా ఉధృతంగా ప్రవహించడంతో ఆత్మకూరు - దోర్నాల మధ్య వాహనాల రాకపోకలు స్తంభించాయి. మధ్యలో నిలిచిపోయిన ప్రయాణికులకు, వాహన చోదకులకు ఇక్కడి అధికారులు భోజన, వసతి సదుపాయం కల్పించారు. నీటి ఉధృతి తగ్గుముఖం పడితేనే వాహనాల రాకపోకలకు అనుమతిస్తామని అధికారులు స్పష్టం చేశారు.



బండిఆత్మకూరు: పెద్ద దేవళాపురంలో నీటమునిగిన కాలనీ



నీటి మునక నుంచి బయటపడ్డ మిరప పంట



ట్రాక్టర్‌లో భవనాశి నది దాటుతున్న వధువు (వలయంలో)

వివాహ వేడుకలకు మొంథా ఎఫెక్ట్..!

- వరదల్లో చిక్కుకున్న వధువు
- ట్రాక్టర్‌లో భవనాశి నది దాటిన పెళ్లి బృందం

ఆత్మకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ఓ పెళ్లింట్లో కాస్త గందరగోళానికి దారితీసింది. ముహూర్తం రోజే వరుడి ఊరికి చేరుకోవాల్సిన వధువు వరదల్లో చిక్కుకుని ఆ మరుసటి రోజు అత్తారింటికి పయనం కావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెరువు గ్రామానికి చెందిన కళ్యాణిబాయికి అనంతపురం జిల్లా వజ్రకరూర్ మండలం ఎన్ఎన్‌పీ తండా గ్రామానికి చెందిన సురేష్‌నాయక్‌తో వివాహం నిశ్చయమైంది. అక్టోబరు 29న ముహూర్తం, 30న వివాహ తేదీలను వారి పెద్దలు నిర్ణయించారు. అయితే 28వ తేది రాత్రి మొంథా తుఫాన్ ధాటికి ఆత్మకూరు మండలంలోని విస్తారంగా వర్షాలు కురవడంతో నల్లమలలోని వరదరాజ స్వామి ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద చేరింది. దీంతో 29వ తేదిన ప్రాజెక్ట్ నుంచి మూడు గేట్లు తెరిచి 4,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నీరంతా ఆత్మకూరు శివారులో ప్రవహిస్తున్న భవనాశి నదిలోకి చేరడంతో నది ఉప్పొంగి ప్రవహించింది. దీంతో ఆత్మకూరు నుంచి కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలకు రాకపోకలు జరిపేందుకు వీలు లేకుండా అంతరాయం నెలకొంది. వాస్తవానికి ముహూర్తం రోజైన బుధవారమే వధువుతో సహా వారి బంధువులు ఎన్ఎన్‌పీ తండాకు బయలుదేరాల్సి ఉంది. వరద తగ్గుముఖం పట్టకపోవడంతో వారు భవనాశి దాటలేని పరిస్థితి నెలకొంది. గురువారం భవనాశి నది వరద ఉధృతి కొంత మేర తగ్గడంతో ఎట్టకేలకు పెళ్లి బృందం ఓ ట్రాక్టర్ ద్వారా నదిని దాటారు. ఆ తర్వాత అక్కడి నుంచి ఇతర వాహనాల్లో ఎన్ఎన్‌పీ తండాకు బయలుదేరారు.

ఎటు చూసినా ఉల్లి..

శనగ సాగు కోసం తొలగిస్తున్న రైతులు



ఉల్లి గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కోడుమూరు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి గ్రామంలో ఎటు చూసినా ఉల్లిగడ్డలు కనిపిస్తున్నాయి. వర్షం ఆగిపోవడంతో రైతులు ఉల్లిగడ్డలను తొలగించి కొండకు తరలిస్తున్నారు.

మోస్తరు ధర..

కొన్నిరోజులుగా క్వింటా ఉల్లి రూ.500లోపే ధర పలుకగా, తుఫాన్ తెరపినిచ్చాక రూ.800నుంచి రూ.వెయ్యి వరకు ధర పలుకుతుండంతో రైతులు ఊరట చెందుతున్నారు.



నాణ్యమైన ఉల్లిని కోస్తా ప్రాంతానికి తరలించేందుకు ఓ వ్యాపారి రూ.1,200 చెల్లించి కొనుగోలు చేశారు. ఈ ధరల నష్టం నుంచి గట్టెక్కే పరిస్థితి లేదని, కేవలం ఉల్లి కోత ఖర్చులు వస్తాయని రైతులు అంటున్నారు. ఉల్లి పొలంలోనే ఉంటే శనగ సాగు సాధ్యం కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కోస్తున్నామన్నారు.

శనగ సాగుతో గట్టెక్కాలని..



సొంత పొలం రెండెకరాలు, మరో రెండెకరాలు కౌలు తీసుకుని ఉల్లి సాగు చేశాను. రూ.2లక్షలు పైగా ఖర్చు చేసినా నష్టం వచ్చింది. రబీలో శనగ సాగు చేసి గట్టెక్కాలనన్న ఆశతో ఉన్నారు. ఉల్లి నష్టపోయిన మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

● మాదన్న, వెంకటగిరి



బస్సు ప్రమాదం జరిగిన ప్రదేశంలో బూడిదలో బంగారం వేట సాగిస్తున్న దృశ్యం

శవాల బూడిదలో...

- బస్సు ప్రమాదంలో 19 మంది అగ్నికి ఆహుతి
- ఆ ఘటనలో మృతుల బంగారు కోసం అన్వేషణ

కర్నూలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ఘోర ప్రమాదం దృశ్యాలు కళ్ల ముందు చెదిరిపోలేదు. మృత్యుఘోష వినిపిస్తూనే ఉంది. మంటల్లో చిక్కుకొని అగ్నికి ఆహుతి అవుతున్న అభాగ్యుల ఆర్తనాదాలు చెవుల్లో మారుమ్రోగుతూనే ఉన్నాయి. చావు అంచులుదాక వెళ్లి ప్రాణాలతో బయటపడిన వారు ఆ షాక్ నుంచి ఇంకా తేరుకోలేదు. అవేమీ పట్టని కొందరు మానవత్వం మరిచి.. బస్సు పూర్తిగా కాలిపోయి మాంసపు ముద్దగా మారిన మృతదేహాల బూడిదలో బంగారు, వెండి ఆభరణాలు కోసం వెతుకులాట సాగిస్తున్న కొందరి తీరు ప్రశ్నార్థకంగా మారింది. వారికి అది జీవనపోరాటమే కావొచ్చు.. జరిగిన ఘోరం మరవక ముందే బంగారు అన్వేషణ చేయడం ఏమిటి? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలో గత శుక్రవారం అర్ధరాత్రి మూడు గంటల సమయంలో హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారి-44పై బైక్‌ను ఢీకొని చెలరేగిన మంటల్లో వి.కావేరి ట్రావెల్ బస్సు పూర్తిగా కాలిపోయిన బూడిద కుప్పగా మారిన సంగతి తెలిసిందే. ఆ మంటల్లో చిక్కుకొని ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, బీహార్ రాష్ట్రాలకు చెందిన 19 మంది ప్రయాణికులు అగ్నికి ఆహుతి అయ్యారు. వారిలో ఆరుగురు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. చనిపోయిన వారిలో మెజార్టీగా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ప్రైవేట్ కంపెనీల్లో పని చేస్తున్నవారే. హైదరాబాద్‌కు దీపావళి పండుగకు బంధువులకు ఇళ్లకు వెళ్లి, తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురై మరణించివారు ఉన్నారు. పండుగకు బంధువుల ఇళ్ల వెళ్లిన వారు సహజంగానే బంగారు ఆభరణాలు ధరించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మనుషులతో పాటు వారి శరీరాలపై ఉన్న కాస్తో కూస్తో బంగారు, వెండి ఆభరణాలు కూడా వారితో పాటే కాలి బూడిదయ్యాయి. పోలీసులు, ఆర్టీఏ అధికారులు ప్రమాదానికి గురైన బస్సును ఎక్స్‌కవేటర్ ద్వారా స్థలం నుంచి పక్కకు తరలించారు. ఘటన స్థలంలో రోడ్డు పక్కనే బూడిద కుప్పలు పడ్డాయి. మృతులతో పాటు కాలిపోయిన బంగారు, వెండి ఆభరణాల కోసం కొందరు బూడిదను జల్లెడ పట్టారు. మహిళలు, పురుషులు క్షుణంగా పరిశీలిస్తూ అనుమానం వచ్చిన ప్రతి ముక్కనూ సంచిలోకి వేసుకుంటున్నారు. అక్కడికి సమీపంలో హంద్రీనీవా కాలువ నీటిలో కడిగి బంగారు ముక్కలు బయటకు తీస్తున్నారు. మృతదేహాలు కాలిన బూడిదలో బంగారు కోసం వేట సాగించిన వారు తెలంగాణ వాసులుగా స్థానికులు చెబుతున్నారు.



ప్రమాదానికి గురైన బస్సులో బంగారు ఆభరణాల కోసం వేట సాగిస్తున్న దృశ్యం

మద్దిలేటి స్వామి హుండీ ఆదాయం రూ.44.87 లక్షలు

బేతంచెర్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో కొలువైన మద్దిలేటి నరసింహ స్వామి హుండీ ఆదాయాన్ని అధికారులు గురువారం లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.44.87లక్షలు ఆదాయం సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. మద్దిలేటి స్వామి హుండీల లెక్కింపు దేవదాయ శాఖ పర్యవేక్షకులు రమేష్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. రెండు నెలలకు సంబంధించి జరిగిన లెక్కింపులో రూ.44,87,441 నగదు రూపంలో రాగా, 8.5గ్రాముల బంగారు, కిలో వెండి వచ్చిందన్నారు. ఈ లెక్కింపులో ఆలయ అర్చకులు సిబ్బందితో పాటు భక్తులు పాల్గొన్నారు.



మద్దిలేటి స్వామి క్షేత్రంలో హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

రూ.40 లక్షల ఆర్థిక సాయం

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు బస్సు ప్రమాద దుర్ఘటన బాధితులకు కావేరి ట్రావెల్స్ యాజమాన్యం రూ.40 లక్షలు ఆర్థిక సాయం అందజేసింది. గురువారం కలెక్టర్ చాంబర్‌లో కావేరీ ట్రావెల్స్ ప్రతినిధులు కలెక్టర్ ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సమక్షంలో బస్సు దుర్ఘటనలో మరణించిన, గాయపడిన వారికి చెక్కు రూపంలో మంత్రి టీజీ భరత్‌కి అందజేశారు. మరణించిన వారికి రూ.2లక్షలు చొప్పున 19 మందికి రూ.38 లక్షలు, తీవ్రంగా గాయపడిన నలుగురికి రూ.50వేల చొప్పున మొత్తం రూ.40 లక్షల చెక్కును అందజేశారు.

ఐటీడీఏలో నాగుపాముల కలకలం

శ్రీశైలం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయంలో రెండు నాగుపాములు కనిపించడం కలకలం రేపింది. నిత్యం అధికారులు, సిబ్బంది, గిరిజనులతో రద్దీగా ఉండే ఆఫీసులో రెండు పాములను చూసి అక్కడున్న వాళ్లంతా భయాందోళనకు గురయ్యారు. శ్రీశైలం ప్రాజెక్ట్ స్నేక్ క్యాచర్ ముస్తాక్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి చాకచక్యంగా పాములను పట్టుకొని అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు.



స్నేక్ క్యాచర్ పట్టుకున్న నాగుపాము



19 మంది ఎస్ఐలు బదిలీ



కర్నూలు క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో 19 మంది ఎస్ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐలు తక్షణమే విధుల్లో చేరాలని ఆయన ఉత్తర్వుల్లో ఆదేశించారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
డి.రమేష్ రెడ్డి	అన్నమయ్య జిల్లా, ఉమెన్ పీఎస్	కోసిగి
హనుమంతరెడ్డి	కోసిగి	కర్నూలు టూటౌన్
బి.సతీష్ కుమార్	కర్నూలు టూటౌన్	చిప్పగిరి
ఏ.పి.శ్రీనివాసులు	చిప్పగిరి	కర్నూలు ఫోర్త్ టౌన్
పి.మోహన కిశోర్ రెడ్డి	కర్నూలు ఫోర్త్ టౌన్	కర్నూలు తాలుకా
హెచ్.డాక్టర్ నాయక్	ఇస్వి	వీఆర్, కర్నూలు
జి.అశోక్	వెల్దుర్తి	గూడూరు పీఎస్
ఎం.తిమ్మయ్య	గూడూరు	కర్నూలు త్రీటౌన్
ఎం.నరేష్	కర్నూలు తాలుకా	వెల్దుర్తి
ఎం.పరమేష్ నాయక్	సి.బెళగల్	వీఆర్, కర్నూలు
యు.వేణుగోపాల్ రాజు	డీఎస్‌బీ, కర్నూలు	సి.బెళగల్
మహబూబ్ బాషా	ఆలూరు	వీఆర్, కర్నూలు
జే.మన్మథ విజయ్	డీటీసీ, కర్నూలు	ఆలూరు
ఎం.తిమ్మారెడ్డి	కర్నూలు వన్‌టౌన్	నందవరం
డి.మహేష్‌కుమార్	పెద్ద తుంబళం	ఇస్వి పీఎస్
బి.మల్లికార్జున	కర్నూలు టూటౌన్	పెద్ద తుంబళం
ఏ.దేవదాస్(ఆర్‌పీఎస్ఐ)	ఆదోని త్రీటౌన్	వీఆర్, కర్నూలు
ఎం.మహేంద్ర (ఆర్‌పీఎస్ఐ)	వీఆర్, కర్నూలు	వీసీఆర్, ఆదోని
ఎం.రామదాస్	వీఆర్, కర్నూలు	పత్తికొండ

నిందితుడికి మూడేళ్ల జైలు

ఆత్మకూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయంలో దొంగతనానికి పాల్పడ్డ దొంగ షేక్ మహబూబ్‌బాషాకు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రాహుల్ అంబేద్కర్ మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ వెంకట నారాయణరెడ్డి గురువారం తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్ శివాలయంలో 19-5-2024 వ తేదీ రాత్రి ఓ గుర్తు తెలియని దొంగ గుడి తలుపులు పగులగొట్టాడు. హుండీలోని నగదు రూ.17,000లు సుమారు 2తులా వెండి ఆభరణాలు దొంగతనం అయినట్లు గుడి అర్చకుడు మధుసూదనశర్మ ఫిర్యాదు చేశారు. అప్పట్లో పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో షేక్ మహబూబ్‌బాషాను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.9000 నగదు, 2 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లోని చేసిన పలు దొంగతనాల కేసుల్లో కూడా మహబూబ్‌బాషా నిందితుడు కావడంతో అప్పట్లో కోర్టులో హాజరు పరచడంతో జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు. ఇప్పటి వరకు రిమాండ్‌లో ఉన్న అతడిని గురువారం సదరు కేసుల్లో మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ వివరించారు.

ట్రాక్టర్ కింద పడి హమాలీ మృతి

నంద్యాల టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డులో ట్రాక్టర్ కింద పడి హమాలీ మృతి చెందిన ఘటన గురువారం నంద్యాలలో జరిగింది. ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా తెలిపిన వివరాలివీ.. నంద్యాల పట్టణం ఆర్ఎస్ నగర్‌కు చెందిన హమాలీ దేవసహాయం(60) గురువారం మార్కెట్ యార్డులో ట్రాక్టర్‌లో వెళ్తూ టర్నింగ్ వద్ద డ్రైవర్ ట్రాక్టర్‌ను తిప్పినప్పుడు ట్రాలీలో ఉన్న దేవసహాయం ట్రాక్టర్ వెనుక టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. దేవసహాయం కొన్నేళ్లుగా హమాలీగా పని చేస్తున్నారు. రేషన్ పంపిణీకి సంబంధించిన ట్రాక్టర్‌లో వెళ్తూ ఘటన జరిగింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

- నంద్యాల మార్కెట్‌యార్డులో గురువారం ట్రాక్టర్ కింద పడి చనిపోయిన హమాలీ దేవసహాయం కుటుంబ సభ్యులను మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు రూ.5వేలు అందజేశారు.

రెండో రోజు గాలింపు

- బైకు లభ్యం.. దొరకని వ్యక్తి ఆచూకీ



భవనాశి వాగులో గాలిస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు

పాములపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పాములపాడు గ్రామ శివార్లలోని భవనాశివాగులో గల్లంతైన నాగేశ్వరరావు కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు.. బుధవారం కొత్తపల్లి మండలం నాగంపల్లి గ్రామానికి చెందిన జెల్లె నాగేశ్వరరావు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుపై మోటారు సైకిల్‌పై వెళ్తూ కొట్టుకుపోయారు. ఎస్ఐ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం చీకటి పడే వరకు బోట్ల ద్వారా గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపారు. బైకు లభించింది. అయితే వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ సుభద్రమ్మ పర్యవేక్షించారు.

మహిళ ఆత్మహత్య

- పక్కింటి వారి వేధింపులే కారణమని కూతుళ్ల ఆరోపణ

కోడుమూరు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండ గ్రామంలో మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పక్కింటి వారి వేధింపులే కారణమని కూతుళ్లు మహేశ్వరి, ఈరమ్మ ఆరోపించారు. బాధితుల కథనం మేరకు.. ఉప్పరి సుంకులమ్మ(50)కు భర్త లేడు. ఇద్దరు కూతుళ్లకు వివాహం చేసి, ప్రస్తుతం ఒంటరిగా నివసిస్తోంది. ఇంటిపక్కన ఉన్న మిన్నమ్మ కుటుంబం సుంకులమ్మతో తరచూ వ్యర్థపునీటి విషయంలో గొడవలు పడేవారు. ప్లేటు కడిగిన నీళ్లు తమ ఇంటిముందుకు వచ్చాయన్న కోపంతో మిన్నమ్మ కుటుంబం మృతురాలిపై దాడి చేసి, అవమానించారు. దీంతో మనస్తాపం చెందిన సుంకులమ్మ గురువారం ఇంట్లో గడ్డిమందు తాగింది. పనులకు పిలిచేందుకు వెళ్లిన సహ కూలీలు గమనించి ఇరుగుపొరుగు సాయంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక సాయంత్రం మృతి చెందింది. ఇంటిపక్కన ఉన్న మిన్నమ్మ, కొడుకు శంకర్, కోడలు జయలక్ష్మి దాడిచేయడంతోనే తమ తల్లి చనిపోయిందని కూతుళ్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళపై దాడి కేసులో జైలు, జరిమానా

కర్నూలు లీగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హాలహర్వి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళపై దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కర్నూలు ఏడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి లక్ష్మిరాజ్యం గురువారం తీర్పు చెప్పారు. హాలహర్వికి చెందిన ఫిర్యాది జయలక్ష్మికి అదే గ్రామానికి చెందిన నిందితులు మంగళి రంగన్న, అతని భార్య మంగళి ఈరమ్మ మధ్య డబ్బు విషయంలో మనస్పర్థలు ఉండేవి. ఈ విషయంపై 2017 మార్చి 25వ తేదీన నిందితులు ఫిర్యాది జయలక్ష్మి ఇంట్లోకి వెళ్లి దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కృష్ణమూర్తి నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాల జైలు, రూ.15వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఇన్‌చార్జి పీపీ సరళాదేవి వాదించారు.

కారు దొంగల అరెస్టు

- పది నెలల తరువాత ఛేదించిన పోలీసులు



ఇన్నోవా కారుతో పోలీసులు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో జనవరిలో నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఇన్నోవా క్రిష్టా కారు ఎత్తుకెళ్ళిన దొంగలను ఎమ్మిగనూరు పట్టణ పోలీసులు గురవారం అరెస్టు చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు... జనవరి 15వ తేదీ నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా గోనెగండ్ల మండలం, హెచ్ కైరవాడి గ్రామానికి చెందిన అంజనేయులు (44) ఇన్నోవా క్రిష్టా కారును పార్కింగ్‌చేసి స్వామి దర్శన నిమిత్తం వెళ్లారు. ఇదే అదనుగా మహారాష్ట్ర దొంగల ముఠా కారును దొంగిలించారు. అంజనేయులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎట్టకేలకు పది నెలల తరువాత రెండు రోజుల క్రితం మహారాష్ట్రలో ఉన్న దొంగల ముఠాను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచగా నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దొంగల ముఠాను అరెస్ట్ చేయడానికి సీసీటీవీలు, కర్ణాటక, మహారాష్ట్ర పోలీసుల సమన్వయంతో మహారాష్ట్ర బీడ్ జిల్లాకు చెందిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారు ఎ1 విఠల్ సాకారం లష్కరే, ఎ2 పరశురాం మోహన్ గైక్వాడ్, ఎ3-భీమ్ రావు సహదేవ్, ఎ4 రాజు గైక్వాడ్, ఎ5-అనిల్ జాదవ్, ఎ6- జ్ఞానేశ్వర్ జాదవ్ అని తెలిపారు. దొంగల ముఠా అక్కడ స్థానికులతో పోలీసులపై ప్రతి దాడులకు దిగగా, చాకచక్యంగా వ్యవహరించి అరెస్ట్ చేశామని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ భార్గవి మహారాష్ట్ర పోలీసులను సమన్వయ పరుస్తూ తమకు సహకరించారన్నారు.

రీ వాల్యుయేషన్‌లో వివాదం



- ఆర్‌యూలో కాంట్రాక్టు ఉద్యోగి పెత్తనం
- ఆందోళనలో ప్రొఫెసర్లు, ఉద్యోగులు
- విద్యార్థి నేతల చేతుల్లోకి వర్సిటీ కీలక ఫైళ్లు

కర్నూలు అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎంవో పేషీ పేరుతో ఓ కాంట్రాక్టు ఉద్యోగి రాయలసీమ యూనివర్సిటీలో చేస్తున్న కొందరు ప్రొఫెసర్లు జీర్ణించుకోలేక ఆందోళన పరీక్షల ఫలితాలు దేశమంతా ఆన్‌లైన్ ప్రక్రియ సాగుతుండగా.. రాయలసీమ వర్సిటీలోని కొందరు ఆ ప్రక్రియను కూడా తమ చేతుల్లోకి తీసుకోవడం చర్చనీయాంశమైంది. తాజాగా బుధవారం బీఈడీ 3వ సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ 86 శాతం ఉత్తీర్ణత ఫలితాలు విడుదల చేసింది. పరీక్షల విభాగం కంట్రోలర్‌ను కట్టడి చేసే క్రమంలో ఫలితాల విడుదల ప్రక్రియ అంతా ఓ ఇన్‌చార్జి అధికారి చేతుల్లోకి వెళ్లిందని కొందరు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగి, ఇన్‌చార్జి అధికారి రీ వాల్యుయేషన్ ఫీజు మొదటిసారిగా రూ.300 నుంచి రూ.550కు పెంచడంతో వర్సిటీకి రూ.పది లక్షల ఆదాయం సమకూర్చామని ఉపకులపతిని పక్కదారి పట్టించారనే ప్రచారం జరుగుతోంది. తెరవెనుక కళాశాలల యాజమాన్యాలతో లోపాయికారీ ఒప్పందంతో విద్యార్థులను పాస్ చేయించుకున్నారనే ప్రచారం క్యాంపస్‌లో చక్కర్లు కొడుతోంది. మే నెలలో జరిగిన బీఈడీ పరీక్షల్లో చాలా మందిని కావాలనే ఫెయిల్ చేశారా? అనే సందేహంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. 1098 మంది రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా 955 మంది ఉత్తీర్ణులు కావడం వెనుక పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. యూని వర్సిటీలో ఉద్యోగుల నియామక డాక్యుమెంట్లు బైటికి వెళుతున్నా యని, వాటిని విద్యార్థి నాయకులకు అందించి, ఉపకులపతి ద్వారా చర్యలకు వీరే ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఉద్యోగ నియామక పత్రం బయటకు ఎలా వెళ్లిందని పరిపాలన అధికారి వద్ద ఉద్యోగులు ప్రస్తావించగా సదరు అధికారి హేళనగా మాట్లాడటం అధ్యాపకులు జీర్ణించుకోలేకపోతున్నట్లు సమాచారం.

రీ వాల్యుయేషన్‌లో ఉత్తీర్ణతపై అనుమానాలున్నాయి



బీఈడీ 3వ సెమిస్టర్ రీవాల్యుయేషన్‌లో ఒక్కసారిగా 995 మంది ఉత్తీర్ణత సాధించడం అనుమానంగా ఉంది. కావాలనే ఫెయిల్ చేసి అటు బీఈడీ కళాశాలల యాజమాన్యాలతో కొందరు కోటరి ఉద్యోగులు వసూళ్ల పర్వానికి తెగబడ్డరనే ప్రచారం ఉంది. ఈ విషయంలో నిగ్గు తేలే వరకు పోరాటం చేస్తాం. ఓ కాంట్రాక్టు ఉద్యోగి తరచూ సీఎం పేషీ పేరు చెప్పుకొని దోపిడీ చేస్తున్నాడని వినికిడి. దీన్ని అడ్డుకోడానికి ఆందోళనలకు దిగుతాం. ఇకనైన ఉపకులపతి స్పందించి వర్సిటీని గాడిలో పెట్టాలి. **- ఎస్. శరత్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్**

విషయం నా దృష్టికి వచ్చింది



ఉద్యోగుల నియామకాల హార్డు కాపీలు బయటకు వెళ్లడం సరికాదు. ఇది ఎలా జరిగిందో విచారించి చర్యలు తీసుకుంటా. పరీక్షల విభాగంలో అంతా ఆన్ లైన్‌పద్ధతిని ప్రవేశపెట్టబోతున్నాం. ఇకపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తా. **- వి. వెంకట బసవరావు, ఉపకులపతి ఆర్‌యూ**

కర్ణాటక ఎక్సైజ్ శాఖ తీరుపై అధ్యయనం

కర్నూలు అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆర్. వెంకటేష్ కుమార్‌ను గురువారం బెంగళూరు కమిషనర్ కార్యాలయంలో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి, సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు కలిశారు. కర్ణాటక ఎక్సైజ్ పనితీరుపై ప్రభుత్వం అధ్యయనానికి బృందాలను పంపింది. మద్యం అమ్మకాలు, సరఫరా, డిపోల పనితీరు, డిస్టిల్లరీలు, సరఫరా, నియంత్రణ, విధానంలో చేపడుతున్న విధానాలతో పాటు క్యూఆర్ కోడ్ పని తీరు, ఆ రాష్ట్రంలో అమలు అవుతున్న ఎక్సైజ్ సేవలపై ఆరాతీసినట్లు సమాచారం. స్కానింగ్, డిజిటల్ పేమెంట్, తదితర అంశాలపై పరిశీలించినట్లు తెలిసింది. అక్కడి ఎక్సైజ్ శాఖ చేపడుతున్న కార్యకలాపాలను నివేదికల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఎక్సైజ్ వర్గాలు వెల్లడించాయి. వీరి వెంట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాజేంద్ర ప్రసాద్ వెళ్లారు.



కర్ణాటక ఎక్సైజ్ కమిషనర్‌ను కలిసిన డీసీ, సూపరింటెండెంట్

సమాన విద్యావకాశాలు కల్పించాలి

- యూఎస్ఎఫ్ఐ జాతీయ సలహాదారు అరుణ్‌కుమార్



భగత్ సింగ్‌కు నివాళి అర్పిస్తున్న అరుణ్‌కుమార్

కర్నూలు న్యూసిటీ/ఎడ్యుకేషన్ అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దేశంలో అందరికీ సమానమైన విద్యావకాశాలు కల్పించాలని యూఎస్ఎఫ్ఐ జాతీయ సలహాదారు మాడిశెట్టి అరుణ్‌కుమార్ అన్నారు. గురువారం యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ప్రారంభమైంది. అతిథిగా జాతీయ ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, రాష్ట్ర కార్యదర్శి సందెపోగు ఉదయ్‌కుమార్ హాజరయ్యారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వైద్యకళాశాలను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన సరికాదన్నారు. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సుమారు రూ.5600 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి మర్రెడ్డి వెంకట్‌రెడ్డి, ఏఐసీటీయూ రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, యూవైఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ గణేష్‌బాబు, ఇతర సంఘాల నాయకులు కృష్ణ, బసవయ్య, జాన్‌బాబు, హరి, పవన్, ఆర్యన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును తనిఖీ చేసిన న్యాయాధికారి

నంద్యాల క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సబ్ జైలును గురువారం మూడో అదనపు జిల్లా న్యాయాధికారి, లోక్ అదాలత్ చైర్మన్ అమ్మన్న రాజా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడుతూ సబ్ జైలులో అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. జైలు గదులు, పరిసరాలను, వంటశాలలను, స్నానపు గదులను పరిశీలించారు. ఖైదీల ఆరోగ్య విషయాలు, వారి కుటుంబ సభ్యుల గురించి ఆరా తీశారు. క్షణికావేశంలో చేసిన తప్పులవల్ల కుటుంబసభ్యులు బాధపడాల్సి వస్తుందని, శిక్ష అనం తరం సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలని ఖైదీలకు జడ్జి సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గురుప్రసాద్‌రెడ్డి, లోక్‌అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు వసతి

- గదుల నిర్మాణానికి టీటీడీ సానుకూలం
- శ్రీశైలం దేవస్థానం చైర్మన్ రమేశ్ నాయుడు

శ్రీశైలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సామాన్య భక్తులకు వసతి కల్పించడం కోసం గదుల నిర్మాణానికి టీటీడీ ఈవో అనిల్ సింఘాల్ సానుకూలంగా స్పందించారని శ్రీశైలం దేవస్థానం చైర్మన్ రమేశ్ నాయుడు తెలిపారు. గురువారం ఉదయం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనంలో ఈవోను కలిసి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం శ్రీశైల క్షేత్రానికి రోజురోజుకు పెరుగుతున్న భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రధానంగా వసతి గదుల అవసరం గురించి వివరించారు. టీటీడీ ఆధ్వర్యంలో వివిధ కెటగిరీలలో వసతి గదులతో పాటు దోర్నాలలో డార్మిటరీలు, ప్రధాన కూడళ్లలో శౌచాలయాలు వంటి నిర్మాణాలను వినతి పత్రం అందించారు. శ్రీశైల క్షేత్రంలో టీటీడీ తరపున వసతి సముదాయాల నిర్మాణం కోసం పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డిని పది రోజులలో శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించి నివేదిక సిద్ధం చేయాలని టీటీడీ ఈవో సూచించారన్నారు.



ఈవో అనిల్ సింఘాల్‌కు వినతి పత్రం ఇస్తున్న ఈవో

మహిళలకు ఉచిత శిక్షణ

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జనరల్ డ్యూటీ, అసిస్టెంట్ ట్రైనీ, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు మహిళా ప్రాంగణం డీఎం అంజనీ భూషణ్ ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ సహకారంతో డేస్కాలర్, రెసిడెన్షియల్‌లో 60 రోజుల శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగలవారు. కర్నూలు ప్రాంతీయ కంటివైద్యశాల పక్కన మహిళా ప్రాంగణంలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి విశ్వశాంతి మహాయాగం



యాగశాల దగ్గర స్వామిజీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

- కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

ఎమ్మిగనూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో శుక్రవారం నుంచి 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు జరగనున్నాయి. ఇందుకోసం ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. 13 రోజుల పాటు జరిగే ఈ మహాయాగం శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో జరగనుంది. మహాయాగంలో ప్రధానంగా విష్ణు పంచాయతనం, ఆయుత చండీ, అతి రుద్ర, సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం, చతుర్వేద పూర్వక మహాగణపతి, మహాసౌర, సుదర్శన, లక్ష్మీనారాయణ సహిత శ్రీమద్భాగవత 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు జరుగుతాయి. వీవర్స్ కాలనీ మైదానంలో రెండు నెలలుగా యాగశాల నిర్మాణ పనులు కొనసాగాయి. మైదానంలో మూడు ప్రధాన యాగశాలలను ఏర్పాటు చేశారు. యాగశాలలన్నీ కర్రలో నిర్మించటంతో పాటు పైభాగంలో తాటాకులతో నిర్మించారు. ఒక్కో యాగశాలలో 12 హోమగుండాలు మూడు యాగశాలలో 36 హోమగుండాలు నిర్మించారు. మధ్యలో స్వామీజీ, పండితులు ఉండేందుకు కట్టను నిర్మించారు. రోజు మూడు యాగశాలలో దాదాపు 360 మంది భక్తులు హోమాల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే పండితులు, హోమంలో పాల్గొనే భక్తులు, హోమాలను తిలకించేందుకు వచ్చే ప్రజలకు భారీగా విడిది షెడ్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల కటౌట్లను, పట్టణంలో ప్రధాన రహదారుల్లోను, ప్రధాన కూడల్లోను విద్యుత్ దీపాలతో స్వాగతతోరణాలు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం అల్పాహారం, మధ్యాహ్నం భోజన వసతితో పాటు రాత్రి అల్పాహారాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మహాయాగశాల ఏర్పాట్లలో పట్టణానికి చెందిన తాపీ కార్మికులు, వడ్డెరులు ఉచితంగా పనుల్లో పాల్గొంటున్నారు. అలాగే విశ్వహిందు పరిషత్ సభ్యులు కూడా ఏర్పాట్లలో సహాయ సహకారాలు అందిస్తున్నారు.

భక్తుల సహకారంతోనే...

భక్తుల సహకారంతోనే ఎమ్మిగనూరు పట్టణంలో 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం నిర్వహిస్తున్నాం. మహాగణపతి పూజతో మహాయాగం ప్రారంభం అవుతుంది. 15 రోజుల పాటు వివిధ రకాల హోమాలు నిర్వహిస్తాం. మహాయాగం నిర్వహించడం వల్ల తుఫాన్లు, సునామీలు, అకాల వర్షాల వంటి విపత్తులు రాకుండా ఈ హోమాలు ఉపకరిస్తాయి. భక్తులకు కూడా మంచి జరుగుతుంది. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సహకరిస్తున్నారు. **- కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ, శ్రీకృష్ణపీఠాధిపతి**

ఎమ్మిగనూరు ప్రజల అదృష్టం

ఎమ్మిగనూరు గడ్డపై విశ్వశాంతి మహాయాగం జరగడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టం. ఇంతపెద్ద యాగంతో ఎమ్మిగనూరు ఎంతగానో అభివృద్ధి చెందుతుంది. ప్రాచీన యుగం నుంచి యాగాలతో ఎంతో మంచి జరుగుతుందనే అందరికి తెలిసిన విషయమే. అలాటి ఈ ప్రతి ఒక్కరు సహకరించాలి. శ్రీకృష్ణ పీఠాధిపతులు శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ సంకల్పించిన ఈ యాగం జయప్రదం కావాలని కోరుకుంటున్నా. **- బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు**

పంట నష్టం వివరాల సేకరణ

నందికొట్కూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దెబ్బకు జూపాడు బంగ్లా, నందికొట్కూరు మండలాల్లో నష్టపోయిన పంటలను వ్యవసాయశాఖ అధికారులు లెక్కిస్తున్నారు. గురువారం రెండు మండలాల్లో వర్షం దెబ్బకు నష్టపోయిన వివిధ రకాల పంటల వివరాలను సేకరించినట్లు ఏడీఏ గిరీష్ తెలిపారు. నందికొట్కూరులో 762మంది రైతులు 733 హెక్టార్లలో వేసిన మొక్కజొన్న, సోయాబీన్, జూపాడుబంగ్లాలో 979 మంది రైతులు 1268 హెక్టార్లలో వేసిన మొక్కజొన్న, వరి, పత్తి నష్టం వాటిల్లిందని ఏడీఏ తెలిపారు.

రోడ్డును మరమ్మతు చేయండి

నందికొట్కూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి దేవాలయానికి వెళ్లే రోడ్డును వెంటనే మరమ్మతులు చేయాలని మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆరోడ్డును మున్సిపల్ కమిషనర్ బేబితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దాసి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ అయ్యప్పస్వామి దేవాలయానికి వెళ్లే రోడ్డు దెబ్బతినడంతో మాలాధారులు, భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

కొత్తపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో మేరీ సూచించారు. గురువారం మండలంలోని గువ్వలకుంట్ల, జీ.వీరాపురం గ్రామాల్లో ఆమె పర్యటించి గ్రామస్థులకు సూచనలు చేశారు. మురుగు, వర్షం నీరుఉన్న చోట్ల స్వచ్ఛభారత్ కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. డిప్యూటీ ఎంపీడీవో సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

2న కబడ్డీ జట్ల ఎంపిక

పాణ్యం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ ఎంపిక నవంబరు 2వ తేదీన జరుగుతుందని ఎంఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక విజయానికేతన్ పాఠశాలలో ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు బర్త్, ఆధార్ సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలన్నారు.

రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

గోస్పాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులు తమపేర్లను రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏవో స్వప్నిక, తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ తెలిపారు. గురువారం గోస్పాడు, పసురపాడు, ఒంటి వెలగల, తేళ్లపురి గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంటలు నష్టపోయిన రైతుల వివరాలు జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని వారు తెలిపారు.

అధిక వర్షాలకు 35 గొర్రెలు మృతి

కొత్తపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని కొత్తమాడుగుల సమీపంలో అటవి ప్లాంటేషన్ ప్రాంతంలో జడ్‌వారిపల్లె, ఎదురుపాడు గ్రామాలకు చెందిన రైతుల గొర్రెలు మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎదురుపాడు చెందిన బెండేపు వెంకటేశ్వర్లుకు చెందిన మేకలు 2, ప్రపసాద్‌బాబు 1, కే.శేషన్న 1, స్వామి 1గొర్రె, జడ్‌వరిపల్లె మధుకిషోర్ 4మేకలు, లింగస్వామి 10, జి.బలరాముడు 8, పరుశురాముడు4, రంగస్వామి4, మొత్తం 35 గొర్రెలు మృతి చెందాయి.

పంటలను పరిశీలించిన ఆర్డీవో

పాములపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను ఆర్డీవో నాగజ్యోతి పరిశీలించారు. గురువారం రుద్రవరం, పాములపాడు గ్రామాల్లో నేలకొరిగిన వరి, మొక్కజొన్న, పత్తి పంటలను మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండలంలో దాదాపు ఆరువేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా అన్నారు. వీఆర్‌వో శివన్న సిబ్బంది పాల్గొన్నారు.

రైతులెవరూ భయపడొద్దు

నంద్యాల రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని, రైతులెవరూ భయపడొద్దు అని నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు అన్నారు. గురువారం మండలంలోని కానాల గ్రామంలో ఆర్డీవో చల్లా విశ్వనాథ్, తహసీల్దార్ శ్రీవాణి, ఏవో ప్రసాద్‌రావుతో కలిసి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పంట నష్టాన్ని త్వరగా అంచనా వేయాలన్నారు. పంటనష్టం అంచనా వేగవంతం చేయాలని అధికారులను ఆర్డీవో చల్లా విశ్వనాధ్ ఆదేశించారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. నంద్యాల డివిజన్ పరిధిలో 9 మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. శిరివెళ్ల లో వరి పంటకు అధిక నష్టం జరిగిందన్నారు. కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చి ఆదుకోవాలని తహసీల్దార్ శ్రీవాణిని రైతులు వేడుకున్నారు. న్యాయం చేస్తామని ఆమె హామీఇచ్చారు.

షాపుల కేటాయింపు సమంజసం కాదు

శ్రీశైలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల దేవస్థానంలో అన్యమతస్థులకు షాపులు కేటాయించడం సమంజసం కాదని శ్రీశైలం విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కాశయ్య అన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో డిప్యూటీ రమణమ్మను కలిసి వినతిపత్రం అందించారు. నాగరాజు, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు మెంకటేశ్వర్లు, రామకృష్ణ, ఆనంద్, మల్లికార్జునలు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

- నోటీసు లేకుండా భూమి కొలవడానికి అధికారులు వచ్చారని..

గోనెగండ్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల కింద కొన్న భూమిని కొలవడానికి అధికారులు ముందస్తు నోటీసు లేకుండా రావడంతో కందనాతి సలామ్ అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం సాయంకాలం జరిగింది. గత కొనేళ్ల క్రితం చిన్నమాదన్న భూమిని కందనాతి సలాం కుటుంబసభ్యులు కొన్నారు. అయితే స్థలం కొన్నదానికంటే ఎక్కువగా ఉందని భూమిని కొలవాలని చిన్నమాదన్న కుటుంబసభ్యులు రెవెన్యూ అధికారులను కోరుతున్నారు. ఆ వివాదం ఆరేళ్లుగా కొనసాగుతోంది. గురువారం సాయంత్రం చిన్నమాదన్న, పెద్దమాదన్నతో పాటు మరో వ్యక్తి, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు కలసి భూమిని కొలవడానికి వెళ్లారు.

తనకు ముందస్తు సమాచారం లేకుండా భూమి కొలిచేందుకు వచ్చారంటూ కందనాతి సలాం అడ్డుపడ్డాడు. అయి నప్పటికీ అధికారులు, చిన్నమాదన్న కుటుంబసభ్యులు భూమిని కొలిచేందుకు సిద్ధమయ్యారు. దీంతో సలాం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం సలాంను ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. వారు చిన్నమాదన్న కుటుంబసభ్యులపై ఫిర్యాదు చేశారు. సలాం, ఆయన కుటుంబసభ్యులు సర్వే పనులను అడ్డుకున్నారని రెవెన్యూ సర్వే సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల వారి ఫిర్యాదులను స్వీకరించి విచారణ చేస్తున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.

ఓంకార క్షేత్రానికి రావాలని ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న దేవస్థాన అధికారులు

బండిఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రం ఓంకారానికి పవిత్ర కార్తీక మాసంలో రావాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని దేవస్థానం చైర్మన్ అల్లెచెన్నారెడ్డి, ఈవో ఆకృతి నాగప్రసాద్, సభ్యుడు చంద్రశేఖర్ కోరారు. గురువారం అర్చకులు చక్రపాణి, మృగపాణి ఆశీర్వచనాలు ఎమ్మెల్యేకు అందించి పూలమాల, శాలువాతో సత్కరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. శివదీక్షలో ఉన్నందున విధిగా ఓంకారానికి వస్తానని, క్షేత్రాభివృద్ధి కృషిచేస్తానని ఎమ్మెల్యే వారికి సూచించారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

నంద్యాల ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా రంగనాయకులు, ప్రధాన కార్యదర్శిగా హరినాథగౌడ్, ఉపాధ్యక్షులుగా సుమలత, ప్రభాకర్, అహ్మద్‌పీర్, యాస్మిన్, సురేష్, కార్యదర్శులుగా భాస్కర్‌రావు, సుబ్బారాయుడు, రవీంద్ర, చంద్రశేఖరశర్మ, సుజాత, సుధీర్‌కుమార్‌తో పాటు 9 మంది జిల్లా కౌన్సిలర్‌లుగా నియమించారు. అగడివేముల మండల కమిటీ అధ్యక్షుడిగా టీపీ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులను, జిల్లా కౌన్సిలర్లను ఎంపిక చేశారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం

● నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పాములపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సరోజనివర్ణినియా అధ్యక్షతన ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేంలో అయన పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరును అడిగి తెలసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమస్యలను త్వరగా పరిష్కరించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. త్వరలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేస్తామని, రైతులు స్థానిక వ్యవసాయ కేంద్రంలో తమ పేర్లను నమొదు చేయించుకోవాలని సూచించారు. బాను ముక్కల గ్రామంలో నూతన సచివాలయాన్ని పంచాయతీకి అప్పజెప్పాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శ్మశాన వాటికలు, కంచెల ఏర్పాటు తదితర అంశాలను సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు చర్చించి సమస్యలను పరిష్కరించుకోవాల న్నారు. రుద్రవరం, క్రిష్టారావుపేటలో హైవే పనుల్లో పాఠశాలలు కూల్చినందున నూతన భవన నిర్మాణాలను చేపట్టేందుకు ప్రభుత్వ భూములను గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం అంశాలపై అధికారులతో చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై అందిస్తున్న 'సూర్యఘర్'పై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వివిధ రకాల రోగాలకు చికిత్స చేయించుకొన్న రోగుల కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందించారు. మద్దూరు, వేంపెంట, క్రిష్టారావుపేట, ఎర్రగూడూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులున్నారు.టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, గోవిందు, నాయిని క్రిష్ణయ్య, చెల్లె హరినాథరెడ్డి, సురేశ్, లక్ష్మీకాంతరెడ్డి, ఆదిరెడ్డి, బాలస్వామి, షేక్ నబిరసూల్, మద్దిలేటి, జలాల్ పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం జరిగేనా?


సమావేశం మధ్యలోనే వెళ్లిపోతున్నసభ్యులు (ఫైల్)

నంద్యాల టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పురపాలక సంఘంలో ప్రతి నెలాఖరులో జరిగే కౌన్సిల్ సమావేశం ఈసారైనా జరుగుతుందా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో వైసీపీ నాయకులు బలం ఎక్కువఉందని ప్రవేశపెట్టిన బిల్లులకు అభ్యంతరం తెలిపి సమావేశం జరగకుండా అడ్డుపడి మధ్యలోనే వెళ్లిపోతున్నారు. ప్రజల సమస్యలు ఎవరు కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలు లేకపోలేదు. సమావేశానికి రావడమే ఆలస్యం ఆపై ఇలా చర్చలు జరగకుండా బిల్లులు, రోడ్లు, మంచినీటి సమస్యలు, దోమలు, కాల్వలు, పారిశుద్యం వాటిపై చర్చించకుండా మూడు సమావేశాల నుంచి వెళ్లిపోతున్నారు. గత కొని కౌన్సిల్ సమావేశాల్లో కొందరు సభ్యులు అడిగిన వాటికి నేను కొత్తగా వచ్చానని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న వచ్చానని చెబుతున్నారు. వచ్చే నెల రోజుల్లో చేసి చూపిస్తానని చెప్పి సవాల్ విసిరారు. ఇంత వరకు ఎక్కడా కూడా ఆయన ప్రభావం కనబడలేదు. కేవలం మాటలకు మాత్రమే పరిమితమయ్యారు.

ఉచితంగా వైద్యసేవలు అందించాలి : డీఎంహెచ్‌వో


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డా.ఎన్టీఆర్ వైద్యసేవల కింద రోగులకు అన్ని వైద్యసేవలు ఉచితంగా అందించాలని డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులకు సూచించారు. గురువారం తన చాంబర్‌లో డా.ఎన్టీఆర్ వైద్యసేవ పథకం గురించి వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యాభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేస్తోందన్నారు. డా. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద రోగులకు అన్ని వైద్యసేవలు ఉచితంగా చేయాలన్నారు. ఈ పథకం కింద రోగులనుంచి ఎలాంటి డబ్బు వసూలు చేయరాదన్నారు. డబ్బులు వసూలుచేసే ఆస్పత్రులపై పదింతల అపరాధ రుసుం విధిస్తూ ఆస్పత్రి లైసెన్స్ రద్దుచేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఎన్టీఆర్ వైద్య సేవ కింద పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించేటట్లు చూడాలని డీఎంహెచ్‌వోను కోరారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ లలిత, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.వై. రూపేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా మేనేజర్ ఆర్.శ్రీధర్, నెట్‌వర్క్ ఆస్పత్రుల యజమానులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

పాములపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపెంటకి చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలు సుందర్‌రాజ్, జయశేఖర్ అనారోగ్య కారణాలతో మృతిచెందారు. గురువారం మాజీ సర్పంచ్, టీడీపీ నాయకురాలు రామసుబ్బమ్మ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. టీడీపీ నాయకుడు, తెలుగుసమాజం అధ్యక్షుడు సింగపూర్ టేకూరి నాగేశ్వరరావు బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్నారు. మాజీ ఉపసర్పంచ్ సత్యరాజ్, ఎంపీటీసీ శివకుమార్, యువరాజ్, ప్రసాద్, శ్రీదర్, చిన్నస్వామి పాల్గొన్నారు.

కార్మికులను క్రమబద్ధీకరించాలి

ఆత్మకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం అన్నారు. గురువారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసి కార్మికులందరికి ఒకే క్యాడర్, ఒకే వేతనం కల్పించాలన్నారు. విద్యుత్ శాఖలో ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని అన్నారు. ఆ సంఘం నాయకులు సద్దాం, రామ్‌నాయక్ ఉన్నారు.

ఉద్యమాలతోనే అభివృద్ధి

ఆత్మకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాల ద్వారానే పట్టణాభివృద్ధి సాధ్యపడుతోందని సీపీఎం జిల్లా నాయకులు ఏసురత్నం, రాజశేఖర్, రణధీర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో వారు మాట్లాడారు. ఆత్మకూరులో జనాభా పెరిగినంతగా సదుపాయాలు పెరగడం లేదన్నారు. పట్టణాభివృద్ధి కోసం పౌర సమాజం ముందుకు రావాలని అన్నారు. ఆ పార్టీ నాయకులు సురేంద్ర, మంజుల, ఇస్మాయిల్, నాగేశ్వరరావు, వీరన్న, సద్దాం ఉన్నారు.

2న టెట్ మోడల్ పరీక్ష

నంద్యాల ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేశ్వరి కోచింగ్ సెంటర్‌లో వచ్చేనెల 2వ తేదీన టెట్ అభ్యర్థుల కోసం మోడల్ టెస్ట్‌ను నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు గంగాధర్, రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కోచింగ్ సెంటర్‌లో నవంబర్ 2వ తేదీ నుంచి ఐదు వారాల పాటు ప్రతి ఆదివారం ఉదయం 9గంటల నుంచి నూతన సిలబస్‌లపై మోడల్ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన జిల్లా వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

నిత్యావసరాల కిట్లు పంపిణీ


వరద బాధితులకు సరుకులను పంపిణీ చేస్తున్న సలాం

ఆత్మకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన బాధితులకు రియల్ ఎస్టేట్ వ్యాపారి గురువారం సరుకులు పంపిణీ చేశారు. ఏకలవ్యనగర్ కాలనీలో వరదలతో నష్టపోయినవారిని గుర్తించి వారికి బియ్యం, కందిబేడలు, నూనె, చక్కెర, గోధుమరవ్వతో పలు సరుకులలో కూడి కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సలాం మాట్లాడుతూ వరదలతో ఇబ్బందులకు గురైన పేదలకు తన వంతు సహకారాన్ని అందించడం ఆనందంగా ఉందని అన్నారు.

ముమ్మరంగా వరద సర్వే

బండిఆత్మకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపుర, చిన్నదేవళాపురం గ్రామాల్లో ఇంటింటా వరద సర్వే ముమ్మరంగా చేపట్టారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, జేసీ కార్తీక్, ఆర్డీవో నాగజ్యోతి ఆదేశాల మేరకు తహసీల్దార్ పద్మావతమ్మ సర్వే చేపట్టారు. ఇళ్లలోకి నీరు చేరిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా సర్వే పక్కాగా చేపట్టాలని వీఆర్వోలను తహసీల్దార్ ఆదేశించారు.

మహానందిలో తగ్గిన వరద

● నిలిచిన రాకపోకలు ● బోసిపోయిన మహానంది


నందిపల్లిలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో మహమ్మద్ దౌలా

మహానంది, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలో వరద ప్రభావం చాలా వరకు తగ్గింది. బుక్కాపురం, బొల్లవరం, ఎంసీ ఫారం వద్ద ఉన్న పాలేరు వాగులపై నీటి ప్రవాహం కొనసాగింది. అటు నంద్యాల, గాజులపల్లి నుంచి మహానందికి రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గురువారం కూడా మహానంది క్షేత్రం భక్తులు లేక బోసిపోయింది. కార్తీకమాసంలో క్షేత్రంలో భక్తులు లేక పోవడం ఇటీవల కాలంలో ఇదే ప్రథమం. నందిపల్లి, అబ్బీపురం, గాజులపల్లి ఆర్ఎస్ గ్రామాల్లోని కొన్నికాలనీలు జలమయం అయ్యాయి. వరణుడు శాంతించడంతో ఆయా కాలనీల ప్రజలు ఉపశమనం పొందారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీవో మహమ్మద్ దౌలా, డిప్యూటీ ఎంపీడీవో కలువ భాస్కర్ ఆధ్వర్యంలో సిబ్బంది సహాయంతో పారిశుధ్య పనులు నిర్వహించారు. అపరిశుభ్రతను ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమం ద్వారా తొలగిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి


రైతుకు డ్రోన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

డోన్ టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఏడీఏ సునీత, ఏవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కొత్తబురుజు గ్రామానికి చెందిన రైతుకు కల్పవృక్ష డ్రోన్ రూపునకు 80శాతం సబ్సిడీ కింద డ్రోన్ ఎమ్మెల్యే కోట్ల అందించారు.

● నంద్యాల జిల్లా నూతనంగా మెప్మా పీడీగా బాధ్యతలు స్వీకరించిన వెంకటదాస్ ఎమ్మెల్యే కోట్లని గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

● బేతంచెర్ల మండలానికి చెందిన సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.3.75 లక్షల నగదు చెక్కును లబ్ధిదారుడికి ఎమ్మెల్యే కోట్లతో పాటు బేతంచెర్ల మండల టీడీపీ నాయకురాలు ప్రసన్నలక్ష్మిని కలిసి చెక్కును అందించారు. కార్యక్రమంలో ఉదయ్, బెన్నిరాజు పాల్గొన్నారు.

కూలిన ఇల్లు.. ఒకరికి గాయాలు


కూలిన ఇంటి పైకప్పు

కొలిమిగుండ్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిశెట్టిపల్లెలో గురువారం ఇల్లు కూలి ఒకరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన అంపినేని బాలమ్మ అనే వృద్ధురాలు ఇంటిపై ఉన్న గవాసి బండను తెరవడానికి మిద్దె పైకి ఎక్కింది. కురుస్తున్న వర్షాలకు నానిపోయిన మట్టి మిద్దె ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో పైకప్పుతోపాటు బాలమ్మ కూడా ఇంట్లోకి పడిపోయి స్వల్ప గాయాలయ్యాయి. ఇల్లు కూలిపోవడంతో సామగ్రి ధ్వంసమైనట్లు ఇంటి యజమాని రంగమనాయుడు తెలిపారు.

కేసీ సైడ్ వాల్ మరమ్మతులకు చర్యలు

చాగలమర్రి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 కమాండ్ల వద్ద కేసీ ప్రధాన కాలువ సైడ్‌వాల్, మట్టికట్ట కోతకు గురైంది. విషయం తెలుసుకున్న రాజోలి ప్రాజెక్టు చైర్మన్ హరిప్రసాద్, వైస్ చైర్మన్ గురివిరెడ్డి, అధికారులు కలిసి గురువారం పరిశీలించారు. వర్షాలు తగ్గిన అనంతరం కేసీ సైడ్‌వాల్, మట్టికట్ట మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం కాలువకు గండి పడకుండా ముందస్తుగా రాజోలి ఆనకట్ట నుంచి కేసీకి నీటి ప్రవాహం తగ్గించామని కేసీకెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు.

నేడు కార్యకర్తల సమావేశం

కొలిమిగుండ్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం గుహల ఆవరణలో శుక్రవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 9గంటల నుంచి ఆయా గ్రామాలకు చెందిన కార్యకర్తలతో గ్రామాల సమస్యలపై చర్చిస్తారన్నారు. సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

మహిళా సాధికారతే లక్ష్యం

డోన్ టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మహిళల సాధికారతే లక్షమని మెప్మా పీడీ వెంకటదాస్ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థకు చెందిన రివ్యూ సమావేశం జరిగింది. కమిషనర్, ఆర్పీలు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ పరిహారం అందిస్తాం

● రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

● మండలంలో సుడిగాలి పర్యటన

కోవెలకుంట్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మంత్రి బీసీ కోవెలకుంట్ల మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని బీజనవేముల, చిన్నకొప్పెర్ల, పెద్దకొప్పెర్ల, వల్లంపాడు, గోవిందిన్నె, కోవెలకుంట్ల గ్రామాల్లో వర్షాలకు నీట మునిగిన వరి, మొక్కజొన్న, మిరప తదితర పంటలను, ఇళ్లను మంత్రి బీసీ పరిశీలించారు. అనంతరం పెద్దకొప్పెర, చిన్న కొప్పెర్ల గ్రామాల మధ్యలో కైప వాగు, చిన్న కొప్పెర్ల, వల్లంపాడు గ్రామాల మధ్య ఉన్న నల్లవాగులను మంత్రి బీసీ, అధికారులను ట్రాక్టర్‌లో ఎక్కించుకొని ఆయన స్వయంగా నడుపుతూ వాగులను దాటారు. తమ గ్రామం చుట్టూ వరద నీరు చేరడంతో బయటికి వెళ్లేందుకు వీలు లేదని వల్లంపాడు గామానికి చెందిన టీడీపీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కోవెలకుంట్ల పట్టణంలోని స్వామినగర్ కాలనీలో మరుగు నిల్వ చేరుతుందని మంత్రి దృష్టికి తేచ్చారు. నీట మునిగి పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని జాబితా సమగ్రంగా తయారు చేసి ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటిని ఆదేశించారు. అనంతరం కోవెలకుంట్ల పట్టణంలో పశువైద్యశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుచ్చన్న,


నల్లవాగులో ట్రాక్టరు నడుపుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు శంకర్‌రెడ్డి, గజ్జల హుసేనయ్య, సౌదరదిన్నె సుబ్బారెడ్డి, అమడాల మద్దిలేటి, సుబ్బరాయుడు, శంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, లింగాల నాయుడు, ఏవీ సుబ్బారెడ్డి, కంపమల్ల చిన్నసుబ్బారెడ్డి, గుళ్లదుర్తి సుదర్శన్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గోవర్ధనరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, శివనాగిరెడ్డి, ఏడీఏ సుధాకర్, పశుసంవర్ధకశాఖ ఏడీ కిశోర్‌కుమార్, వ్యవసాయశాఖ ఏడీ సుధాకర్, ఏవో సుధాకర్‌రెడ్డి, తహసీల్దారు పవనకుమార్‌రెడ్డి, ఎంపీడీవో వరప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు, సీఐ హనుమంత నాయక్, ఎస్ఐలు మల్లిఖార్జునరెడ్డి, భూపాలుడు, రమణయ్య పాల్గొన్నారు.


డంప్‌యార్డును పరిశీలిస్తున్న మంత్రి బీసీ

రవ్వలకొండ డంప్ యార్డు పరిశీలన

బనగానపల్లె: పట్టణంలోని రవ్వలకొండలోని డంప్‌యార్డును రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం రాత్రి పరిశీలించారు. డంప్‌యార్డు నిర్వహణను సక్రమంగా నిర్వహించాలని ఈవో సతీశ్‌రెడ్డిని ఆదేశించారు. డంప్‌యార్డుకు వచ్చే వాహనాల రాకపోకలకు సరైన రహదారి మార్గం ఉండేలా ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, ఉపసర్పంచ్ బురానుద్దీన్ ఉన్నారు.

‘మొంథా’తో రైతన్న కుదేలు

● జల దిగ్బంధంలో గ్రామాలు

● పొంగి ప్రవహిస్తున్న వక్కిలేరు, కుందూ

● నీట మునిగిన పంటలు


చాగలమర్రిలో నీట మునిగిన వరి, జొన్న పంట

చాగలమర్రి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో గత మూడు రోజులపాటు కురిసిన వర్షాలకు రైతన్న కుదేలయ్యారు. గురువారం వరుణుడు వీడిన వరద తగ్గలేదు. కుందూ, వక్కిలేరు పొంగి ప్రవహించడంతో జన జీవనం స్తంభించింది. మండలంలోని బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె, నేలంపాడు గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. చాగలమర్రి, కలుగొట్లపల్లెలో వరి, జొన్న, మినుము పంటలు నీట మునిగాయి. దీంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది.

దొర్నిపాడు: మొంథా తుఫాన్ ప్రభావంతో దొర్నిపాడు మండలంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. క్రిష్టిపాడు, దొర్నిపాడు లోతట్టు కాలనీల్లో వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. కోవెలకుంట్ల నుంచి క్రిష్టి పాడు గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు నీరు అధికంగా ఉండటంతో ఆయా గ్రామాల రాకపోకలు స్తంభించిపోయాయి. క్రిష్టిపాడు కుందూనది ఉగ్రరూపం దాల్చడంతో వందల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. ఎంపీడీవో సావిత్రి సిబ్బందితో వెళ్లి పంట పొలాలను గురు వారం పరిశీలించారు. ఎంపీడీవో సావిత్రి, వ్యవసాయాధికారి ప్రమీల, సిబ్బంది ఆయా గ్రామాలను సందర్శించి రైతులు నష్టపోయిన పంటలను పరిశీలించారు.

రుద్రవరం: మండలంలోని చిలకలూరు గ్రామ సమీపంలో వక్కిలేరు వాగు గత నాలుగురోజులుగా పొంగి ప్రవహిస్తుంది. గురువారం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎర్రగుడిదిన్నె వద్ద ఉన్న నేలవంతెనపై కూడా వరదనీరు ప్రవాహం తగ్గలేదు. అక్కడ కూడా రాకపోకలు నిలిచిపోయాయి. ఎర్రగుడిదిన్నె నేల వంతెన దెబ్బ తిందని స్థానికులు తెలిపారు.



దొర్నిపాడులో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు, చిలకలూరు సమీపంలో పొంగి ప్రవహిస్తున్న వక్కిలేరు

కార్తీక పౌర్ణమికి తరలిరండి

● పోస్టర్లను ఆవిష్కరించిన బీసీ రాజారెడ్డి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ రాజారెడ్డి, నాయకులు

బనగానపల్లె, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబరు 5వతేదీన యాగంటిలో జరిగే కార్తీక పౌర్ణమి వేడుకలకు తరలిరావాలని అరుణభారతి వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు 5వ తేదీన యాగంటిలో నిర్వహించే పంచరత్నాలు నాటక ప్రదర్శన పోస్టర్లను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా కర్నూలు టీజీవీ కళాక్షేత్రం, బనగానపల్లె అరుణభారతి సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పంచరత్నములు ఉచిత నాటకాల ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. నవంబరు 5వతేదీ బుధవారం రాత్రి 8 గంటలనుంచి ప్రదర్శనలు ప్రారంభమవుతాయన్నారు. గయోపాఖ్యానం పడకసీను, శ్రీకృష్ణతులాభారం, అలకసీను, గయోపాఖ్యానం యుద్ధసీను, భవానీ సీను, సత్యహరిశ్చంద్ర కాటిసీను నాటక ప్రదర్శనలు జరుగతాయన్నారు. కళాకారులు శ్రీనివాసరెడ్డి, రమణ, చల్లా నవీన్‌కుమార్ చౌదరి, డాక్టర్ కదిరి రమేశ్, సుశీల, ఎం.వీ.బాషా, హనుమంతుయాదవ్, గజల్ కళాకారుడు మహ్మద్‌మియా తదితరులో ఇందులో పాల్గొంటున్నారన్నారు. యాగంటి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి సహకారంతో ఈ నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళలను, కళాకారులను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అమర్‌నాథరెడ్డి, మౌళీశ్వరరెడ్డి, శంఖేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, భూషన్న, భరతుడు, శివయ్య, నాయక్, రామశేఖర్ పాల్గొన్నారు.

కార్తీక ఉత్సవాలకు బీసీ రాజారెడ్డికి ఆహ్వానం: మండలంలోని యాగంటి ఉమామహేశ్వర వాసవీ సేవా సంఘం, ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం వారి ఆధ్వర్యంలో కార్తీక ఉత్సవాలకు హాజరు కావాలని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని గురువారం ఆహ్వానించారు. నవంబరు 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా యాగంటి క్షేత్ర ఆర్యవైశ్య నిత్యాన్న దానసత్రంలో సత్యనారాయణస్వామి వ్రతం, కోటి దీపోత్సం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు నూకల నాగరాజు, వెంకటసుబ్బయ్య, టంగుటూరు శ్రీనయ్య, శ్రీరామ వెంకటసుబ్రహ్మణ్యం, మారుతి రవికుమార్ పాల్గొన్నారు.

జింక పోలీసులకు అప్పగింత

బనగానపల్లె, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం గ్రామ సమీపంలోని ఎస్సార్బీసీలో కొట్టుకు వస్తున్న ఓ జింకను నందవరానికి చెందిన రైతులు రక్షించి నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, పోలీసులకు గురువారం అప్పగించారు. నందవరం గ్రామ సమీపంలోని ఎస్సార్బీసీలో నీటి ఉధృతికి కొట్టుకు వస్తున్న జింకను నందవరం రైతులు శివశంకర్‌రెడ్డి, రంగారెడ్డిలు చూసి బయటకు తీసి రక్షించారు. జింక కాళ్లకు గాయాలు కావడంతో నందవరం పశువైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి ప్రాథమిక చికిత్సలు నిర్వహించారు. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, పోలీసులకు సమాచారం అందించారు. నందివర్గం పోలీసులు జింకను స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ పోటీలు

డోన్ టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డోన్ నియోజకవర్గానికి సంబంధించిన డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలకు సంబంధించిన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవోలు ప్రభాకర్, రఘునాయక్, ప్యాపిలి ఎంఈవో ఎస్. వెంకటేశ్వర నాయక్‌లు న్యాయ నిర్ణేతలుగా ప్రధానోపాధ్యాయులు సురేష్‌బాబు, సర్పంచ్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మూడు మండలాల నుంచి విద్యార్థులలో డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల 8వ తరగతి విద్యార్థిని పి.సుసన్న ఎంపికైంది. హెచ్ఎం షైమున్నీసాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30 అంశాలకు ఆమోదం

డోన్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశంలో 30 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ రసాభాసగా సాగింది. ఈ కౌన్సిల్‌లో 30 అంశాల తీర్మాణాలను ఆమోదించారు. ఈ కౌన్సిల్ సమావేశంలో పందులను పట్టణానికి దూరంగా తరలించాలనే అంశంపై మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య కోరారు. 20వ వార్డు కౌన్సిలర్ మిట్టా ఉమామహేశ్వరి పట్టనంలోని ఫాగింగ్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సభా దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రసాద్‌గౌడు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి నివేదికలు పంపాం: జేసీ

రుద్రవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదికలు పంపామని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. గురువారం సాయంత్రం రుద్రవరం మండలం కోటకొండలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను జేసీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్‌తో నష్టపోయిన ప్రతి రైతు పంట నమోదు చేయాలన్నారు. మొలకెత్తిన మొక్కజొన్న పొత్తులను రైతులు వెంకటపతి, నరసింహులు జేసీకి చూపించారు. వరి ఏ మేరకు నష్టం జరిగిందని వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దారు దోనీ ఆల్‌ఫ్రెడ్, ఏవో సుమతి డిప్యూటీ తహసీల్దారు హుసేనీ మాజీ ఎంపీటీసీ సత్యంరాజు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఉయ్యాలవాడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుడుమలదిన్నె గ్రామానికి చెందిన శివారం గోపాల్‌పై అదే గ్రామానికి చెందిన చిన్నస్వామి, అతని భార్య శివమ్మ, కుమారులు హరీష్, హరిలు కలిసి కర్రలు, రాడ్లతో దాడి చేసినట్లు ఎస్ఐ రామిరెడ్డి గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పాత కక్షలు మనసులో పెట్టుకొని పై ముగ్గురు గోపాల్‌పై దాడి చేసి గాయపరచారన్నారు. గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

అవుకు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వయోజన విద్య నోడల్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో ఏపీఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ‘ఉల్లాస్ అక్షర ఆంధ్ర’లో భాగంగా డీఆర్‌డీఏ వలంటీర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో- 2 వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలి

బేతంచెర్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని వార్డు కౌన్సిలర్లు నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్‌ను కోరారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశం చైర్మన్ చలంరెడ్డి అధ్యక్షతన కమిషనర్ హరిప్రసాద్ నిర్వహించారు. కౌన్సిలర్ మహేశ్వరి మాట్లాడుతూ సంజీవననగర్ కాలనీలో మసీదు సందులో ప్రజలకు నీటి సరఫరా జరుగుతుందని మిగతా ప్రాంతాల్లోనీటి సరఫరా జరగడం లేదన్నారు. ఏఈ మధుతేజరెడ్డి మాట్లాడుతూ త్వరలో అన్ని కాలనీలో నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కౌన్సిలర్లు మధుసూదన్, నంద్యాల కుమారి, ముబీన, మధుకుమార్, బుగ్గన సుశీలమ్మ, పోలూరు ఆదిలక్ష్మీ పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. చైర్మన్ చలంరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎల్లయ్య, మెప్మా సీఈవో ఇద్రుస్‌బాషా పాల్గొన్నారు.

అరటి సాగులో మెలకువలు పాటించాలి

ప్యాపిలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అరటి సాగులో మెలుకువలు పాటించాలని ఉద్యానవనశాఖ అధికారి కళ్యాణి సూచించారు. గురువారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో ఆమె అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అరటికి చీడపీడలు సోకే అవకాశాలు న్నాయన్నారు. రైతులు అప్రమతంగా ఉండాలని సూచించారు.

ముంపు బాధితులకు అల్పాహారం పంపిణీ

ఆళ్లగడ్డ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రి నగర్‌లో భారీవర్షాలతో నిరాశ్రయులైన కుటుంబాలకు మున్సిల్ కమిషనర్ కిషోర్ ఆధ్వర్యంలో అధికారులు అల్పాహారం అందజేశారు. శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వరద నీరు రావడంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు అల్పాహారం అందజేసినట్లు వివరించారు.